సాక్షి
నిర్మల్
సోమవారం । 28 । ఆగస్టు । 2023



ప్రాణాలు తీసిన అతివేగం 8లో▸

జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. వాహనాల అతివేగమే ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది.

ఆత్మగౌరవసభకు ఉద్యమకారులు

నిర్మల్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభకు జిల్లా ఉద్యమకారులు వెళ్లారు. జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్, నిర్మల్ జిల్లా చైర్మన్ ముష్కం రామకృష్ణగౌడ్, నిర్మల్ నియోజకవర్గ చైర్మన్ సామ కిరణ్‌రెడ్డి, శంకర్, గోపి గంగన్న, సాయన్న, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఇస్మాయిల్, సామల వీరయ్య, కూన భూమన్న, కొట్ల శేఖర్, పోతారెడ్డి తదితరులు ఆత్మగౌరవసభలో పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 /23.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న కిశోర్

కడెం: 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్ సూచించారు. మండలంలోని కడెం, కన్నాపూర్ తదితర పోలింగ్ కేంద్రాలను ఆదివారం తనిఖీ చేశారు. ఓటరు జాబితా సవరణలు, ఇతర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నూతన ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని బీఎల్వోలకు సూచించారు. అంతకుముందు ఉట్నూర్ ఆర్డీవో, ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి జీవకర్‌రెడ్డి మండల కేంద్రంలోని పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ ఎం.రాజేశ్వరి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

భోసిలో విజ్ఞానమేళా



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

తానూరు: మండలంలోని భోసి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి గణిత, సామాన్యశాస్త్రం మేళా నిర్వహించారు. జిల్లాలోని ఆయా శిశుమందిర్ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు వారు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచినవారిని ఆదిలాబాద్ విభాగ్ స్థాయికి ఎంపిక చేశారు. సెప్టెంబర్ 3, 4 తేదీల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న మేళాలో వీరు పాల్గొననున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్తాత్రి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, సర్పంచ్ ఆనంద్, వీడీసీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్, నాయకులు గోపాల్, రాములు, పురుషోత్తం, నాగనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కడెం'కు స్వల్ప ఇన్‌ఫ్లో



కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఆదివారం 2,429 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 (7.603టీఎంసీలు) అడుగులు కాగా, ప్రస్తుతం 696.150 (6.635టీఎంసీలు) అడుగుల నీటిమట్టం ఉంది. ఆయకట్టు కుడి కాలువకు 10, ఎడమ కాలువకు 826 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



రద్దీగా అక్షరాభ్యాస మండపం

తానూరు: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం సెలవు దినం కావడంతో అధికసంఖ్యలో వచ్చిన భక్తులు ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 710 అక్షరాభ్యాసాలు జరిగాయి. గోదావరినది స్నానఘట్టాల వద్ద, ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి కనిపించింది.

మీసేవ కేంద్రాల నిర్వాహకుల సంఘం జిల్లా కార్యవర్గం



నూతన కార్యవర్గం

నిర్మల్: మీసేవ కేంద్రాల నిర్వాహకుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మెరుగు పవన్, ప్రధాన కార్యదర్శిగా రామోజీ వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, అలీమ్, కోశాధికారిగా అశ్విన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ.. మీసేవ నిర్వాహకుల సంఘం అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

డెంగీ బెల్స్..!

- క్రమంగా పెరుగుతున్న కేసులు
- ఆస్పత్రుల్లో చేరుతున్న బాధితులు
- నీటి నిల్వల్లో 'టైగర్' దోమలు
- ఇప్పటికే వైరల్, సీజనల్ జ్వరాలు



ఆస్పత్రిలో జ్వర బాధితులు

నిర్మల్: వర్షాలతో గుంతల్లో నిలిచిన నీళ్లు, పేరుకుపోయిన అపరిశుభ్రత, రోడ్లు, ఇళ్ల మధ్యలోనే నీటి నిల్వలు.. ఇలాంటి వాతావరణం జిల్లాలో వ్యాధులను పెంచుతున్నాయి. ఇప్పటికే వైరల్ ఫీవర్ వెంటాడుతోంది. చిన్నారులు జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఇలాంటి సందర్భంలోనే జిల్లాలో మెల్లగా డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ప్రాణాంతక మహమ్మారి క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో వందమంది వరకు డెంగీ బారినపడ్డట్లు సమాచారం. స్థానిక ఆస్పత్రులతో పాటు నిజామాబాద్, హైదరాబాద్‌లో కొందరు చికిత్స పొందుతున్నారు.

జిల్లా ఆస్పత్రిలో సదుపాయాలు

ప్రతీ వర్షాకాలం సీజన్ మొదలైనప్పటి నుంచి డెంగీ కేసులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఇటీవల వర్షాలు తగ్గినా నీటి నిల్వలతో దోమలు పెరుగుతున్నాయి. జిల్లా ఆస్పత్రితో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ బాధితులు చికిత్స పొందుతున్నారు. స్థానికంగా పరీక్షలు చేసిన తర్వాత డెంగీగా నిర్ధారిస్తున్నారు. ఇక జిల్లా ఆస్పత్రిలో డెంగీకి కావాల్సిన వైద్య సదుపాయాలు, ప్లేట్‌లెట్స్ కౌంటింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

పగటిపూట కుట్టే 'టైగర్'..

టైగర్ (ఎడిస్ ఈజిప్టై).. ఇదే మనిషి ప్రాణాలను తీసే డెంగీ కారక దోమ. పగటి పూట మాత్రమే కుట్టే ఈ దోమ ఇప్పుడు హడలెత్తిస్తోంది. ఉదయం 10నుంచి సాయంత్రం ఐదు గంటల వరకే ఈ దోమ కుడుతుంది. రాత్రిపూట చీకటి ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకుంటుంది. చూసేందుకు మామూలు దోమ కంటే చిన్నసైజులో ఉండే దీనికి కాళ్లు, రెక్కలపై తెల్లమచ్చలుంటాయి. నేలకు తక్కువ ఎత్తులో తిరుగుతూ.. ఎక్కువగా మనుషుల కాళ్లు, మడమలకు కుడుతుంది. దీంతో తీవ్రమైన జ్వరం, జలుబు, వాంతులు, నొప్పులు మొదలవుతాయి. రక్తంలో ప్లేట్‌లెట్స్ పడిపోతాయి. వెంటనే గుర్తించి సరైన చికిత్స తీసుకోకపోతే మనిషి ప్రాణాలే పోతాయి.

నివారణ మన చేతుల్లోనే..

- ప్రాణాంతక డెంగీ బారిన పడకుండా ఉండేందుకు నివారణ మార్గాలే శరణ్యం. అవి కూడా మన చేతుల్లోనే ఉన్నాయి.
- ప్రధానంగా డెంగీ దోమ ఉత్పత్తికి కారణమయ్యే నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలి.
- ఇంట్లో బంతి, తులసి మొక్కలు పెంచుకుంటే దోమలు తక్కువగా వస్తాయి.
- గాలి, వెలుతురు ఇంట్లోకి బాగా ఉండేలా చూసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి కిటికీలు, తలుపులకు దోమలు రాకుండా జాలీలు ఏర్పాటు చేసుకోవాలి.
- సైడ్ ఎఫెక్ట్స్ ఉండే రసాయనిక కాయిల్స్ వాడేకంటే సంప్రదాయ పొగ వేసుకోవడం ఉత్తమం.
- పగటిపూటైనా పడుకునేటప్పుడు తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలి.
- చిన్నారులకూ పొడవాటి చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరింపజేయాలి.
- పరిసరాల పరిశుభ్రతే.. ప్రాణాలకు రక్ష.. అనే సూత్రాన్ని ఎల్లప్పుడూ పాటించాలి.
- డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలి.

అన్ని సదుపాయాలున్నాయి

డెంగీకి పెద్దగా భయపడాల్సి అవసరం లేదు. సకాలంలో సరైన వైద్యాన్ని పొందితే సరిపోతుంది. ప్లేట్‌లెట్స్ తగ్గడానికి ఎన్నో కారణాలుంటాయి. ప్రతీ జ్వరాన్ని డెంగీగా భావించొద్దు. వ్యాధి నిర్ధారణ చేసుకున్న తర్వాతే డెంగీ చికిత్స పొందాలి. జిల్లా ఆస్పత్రిలో డెంగీకి చికిత్స పొందవచ్చు. ప్రధానంగా ఇళ్లు, పరిసరాల్లో దోమలు పెరగకుండా చూసుకోవాలి.

– డాక్టర్ దేవేందర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్

నిర్లక్ష్యంతోనే దోమలు వృద్ధి

డెంగీ వ్యాప్తికి దోమల కంటే మనుషులే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఓవైపు ప్రధానమంత్రి నుంచి మొదలుకుని పారిశుధ్య కార్మికుడి దాకా స్వచ్ఛత పాటించండి ప్రభో.. అని మొత్తుకుంటున్నా.. కనీసం వారి మొర ఆలకించడం లేదు. ఇదే టైగర్ దోమ పెరగడానికి కారణమవుతోంది. ఈ దోమ జీవితచక్రం కేవలం వారంరోజుల్లోనే ప్రారంభమవుతుంది. మిగతా దోమలకు విరుద్ధంగా మంచినీటి నిల్వల్లోనే గుడ్లు పెడుతుంది. ఇంటి పరిసరాల్లో నిర్లక్ష్యంగా వదిలేసిన మంచినీటి నిల్వలే వీటి ఉత్పత్తి కేంద్రాలవుతున్నాయి. ఖాళీ పూలకుండీలు, కొబ్బరిచిప్పలు, వాడకుండా పెట్టిన కూలర్లు, రోళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, టీకప్పులు, పెంకులు, టైర్లు తదితర నీటి నిల్వ పాత్రలు, ప్రదేశాలే టైగర్ దోమ పెరగడానికి దోహదమవుతున్నాయి. గుడ్లు పెట్టిన వారంలోనే దోమగా మారి కుడుతుంది.

ప్లేట్‌లెట్స్ పడిపోతూ..

పేరుకు చిన్నదోమే.. కానీ ఇది కుడితే డేంజర్ డెంగీలో పడేస్తుంది. టైగర్‌దోమ వరుసగా ఐదారుసార్లయినా కుట్టేందుకు ప్రయత్నిస్తుంది. అలా దీని బారిన పడితే ముందుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. జలుబు, వాంతులు, కీళ్లనొప్పులు, కంటి సంబంధ సమస్యలు మొదలవుతాయి. ప్లేట్‌లెట్స్ పడిపోతుంటాయి. సాధారణ జ్వరం అనుకుని వైద్యులు ముందుగా చికిత్స అందిస్తారు. ఎంతకీ తగ్గక పోతేనే అనుమానంతో డెంగీగా నిర్ధారిస్తారు. ప్లేట్‌లెట్ల పరీక్షతోనే డెంగీ ఉన్నట్లు తేలుతుంది. డెంగీ నిర్ధారణ పరీక్ష చేసుకున్న తర్వాత పాజిటివ్ రిపోర్టు వస్తేనే సంబంధిత వైద్యం పొందాలి. ప్రతీ జ్వరాన్ని డెంగీగా భావించాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

మామడ: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలను ప్రదర్శించాలని బీఎల్వోలకు సూచించారు. జాబితాలో తప్పులుంటే గుర్తించాలని, 18ఏళ్లు నిండినవారంతా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ తదితరులున్నారు.

చెస్‌తో మేధోశక్తి పెంపొందుతుంది

- అదనపు కలెక్టర్ జీ రాహుల్



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలటౌన్: చెస్‌తో విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందించవచ్చని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బీ రాహుల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ పోటీలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాహుల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. చెస్‌తో చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బిజ్జు, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ సిరాజ్ ఉర్ రెహమాన్, ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య, ఆసిఫాబాద్ అధ్యక్షుడు కోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో సోపతిలా..!



నూతన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి (ఫైల్)

- జిల్లాకు 108, 102 వాహనాలు
- అంబులెన్స్‌ల్లో జీపీఎస్ సిస్టం
- క్షణాల్లో ప్రమాదస్థలికి వాహనం
- పాతవాటి స్థానాల్లో కొత్తవి సరఫరా

నిర్మల్‌చైన్‌గేట్: అత్యవసర సమయంలో కుయ్.. కుయ్.. అంటూ అంబులెన్స్‌లు ఇక మరింత వేగంగా ఘటనాస్థలికి చేరనున్నాయి. వైద్యరంగం బలోపేతంలో భాగంగా సర్కారు జిల్లాకు కొత్త 108 వాహనాలను సరఫరా చేసింది. మరో వైపు గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం 102 అమ్మఒడి వాహనాలనూ కేటాయించింది. వీటితో జిల్లా ప్రజలకు అత్యవసర సేవలు మెరుగుపడనున్నాయి. అత్యవసర సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు 108 వాహనం ఎంతో భరోసానిస్తున్నాయి. ఫోన్ చేయగానే నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలికి చేరుకుంటున్నాయి. రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రిలో చేర్పి ప్రాణాలు నిలుపుతున్నాయి. రాత్రి, పగలు, సెలవు దినాల్లోనూ నిరంతరం సేవలందిస్తున్నాయి.

జీపీఎస్‌తో అనుసంధానం

జిల్లాకు చెందిన పాత అంబులెన్స్‌ల స్థానంలో ప్రభుత్వం కొత్త వాహనాలు సరఫరా చేసింది. నూతనంగా అందించిన వాహనాల్లో జీపీఎస్‌ను అమర్చారు. బాధితులు ఫోన్ చేయగానే సెకన్ల వ్యవధిలోనే ఫోన్లకు 108 లొకేషన్ వస్తుంది. తద్వారా వాహనం ఎక్కడ ఉంది? ఎంత సమయం పడుతుంది? అనే వివరాలు తెలుస్తాయి. ఈ విధానం అమలుకు పరికరం ఎంతగానో సహకరిస్తుంది.

అమ్మకు అండగా 24 గంటలు..

102 'అమ్మ ఒడి' వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలను ఆపదలో ఆదుకుంటున్నాయి. మూడు నెలలు నిండిన నుంచి వారికి ఏఎస్‌సీ 1, 2, 3, 4 వరకు.. ప్రసవం తర్వాత ఏడాది వరకు ఇంటినుంచి ఆస్పత్రికి చేరవేస్తున్నాయి. స్థానికంగా ఉన్న ఆశ కార్యకర్తలు సమన్వయం చేసుకుని వారికి సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు ఈ వాహనం సేవలు 12 గంటలు మాత్రమే ఉండగా.. ఈ నెల 1నుంచి 24 గంటల పాటు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలోని సీహెచ్‌సీ, ప్రాంతీయ మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆవరణలో ఇవి అందుబాటులో ఉంటాయి. ఫోన్ రాగానే పైలెట్లు సంబంధిత ఇళ్లకు వెళ్లి గర్భిణులు, బాలింతలను ఆస్పత్రికి తీసుకొస్తారు. రాత్రివేళ ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నిత్యం 17నుంచి 20మందిని ఇంటి నుంచి ఆస్పత్రులకు తీసుకెళ్లి తిరిగి ఇళ్లకు చేరవేస్తున్నారు.

జిల్లాలో సేవలు ఇలా..

నిరుపేద కుటుంబాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు మాత్రమే వైద్య సేవలందించేందుకు ఉపయోగపడే 102 వాహనాలు ఐదు ఉన్నాయి. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులు, ప్రసవ సమయంలో గర్భిణులు, గుండెపోటు, పక్షవాతం వచ్చిన వారిని అత్యవసరంగా ఆస్పత్రులకు తరలించేందుకు ఉపయోగపడే 108 వాహనాలు జిల్లాకు ఎనిమిది కేటాయించారు. ఇందులో ఖానాపూర్, మామడ, నిర్మల్-1, నిర్మల్-2, సారంగపూర్, కుంటాల, భైంసా, ముధోల్‌లో వాహనాలుండగా.. మిగతా మండలాలకు కూడా కేటాయిస్తే జిల్లాలోని ప్రజలందరికీ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

108లోని అత్యాధునిక పరికరాలు

108 వాహనాల్లో ప్రభుత్వం అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. వాటిలో మల్టీచానల్ మానిటర్, సెక్షన్ ఆపరేటర్స్, ఆటోమెటెన్ ఎక్స్‌ర్నల్, డిఫిబ్రిలేటర్ కారింగోస్కోప్స్, స్టెతస్కోప్, థర్మామీటర్, పల్స్ ఆక్సిమీటర్ పైలరి టార్చ్, నిడిల్ డిస్టర్బ్, టైప్ సిలిండర్ తోపాటు వివిధ రకాల మందులుంటాయి.

పార్థివ వాహనం ఏది?

పార్థివదేహాల సేవలు అందుబాటులో లేక జిల్లాలోని పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పతుల్లో మృతిచెందిన వారిని స్వగ్రామాలకు తరలించాలన్నా.. రహదారి ప్రమాదాలు, ఆత్మహత్య ఘటనల్లో చనిపోయినవారి మృతదేహాలను శవపరీక్ష కోసం ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా.. పోస్టుమార్టం అనంతరం తిరిగి స్వగ్రామాలకు తరలించాలన్నా అవస్థలు పడుతున్నారు. మృతదేహాలను తరలించేందుకు ప్రైవేట్ వాహనాలవారు రూ.వేలల్లో డిమాండ్ చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో వాహనాలు అందుబాటులో లేక శవపరీక్ష చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాకు వైకుంఠవాహనం కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం జిల్లాకు ఎనిమిది 108, ఐదు 102 వాహనాలు కేటాయించారు. అత్యాధునిక జీపీఎస్ సిస్టం కలిగి ఉన్న ఇవి 24 గంటలు అందుబాటులోకి వచ్చాయి. ఘటనాస్థలికి 15 నిమిషాల్లో చేరుకునేలా ప్రధాన కార్యాలయం నుంచి మానిటరింగ్ చేసేలా చర్యలుంటాయి. అత్యవసర సమయంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. మండలానికో అంబులెన్స్ కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

– మధు, 108, 102 సేవల మేనేజర్

'బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి'



మాట్లాడుతున్న రాజేశ్ సంభాజీ పవార్

భైంసాటౌన్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యమని మహారాష్ట్రలోని నాయగాం ఎమ్మెల్యే, ముధోల్ అసెంబ్లీ ప్రవాస్ యోజన బాధ్యుడు రాజేశ్ సంభాజీ పవార్ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షురాలు పీ రమాదేవి అధ్యక్షతన ఆదివారం భైంసాలో నిర్వహించిన ప్రవాస్ యోజన ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. వారంరోజులుగా ముధోల్ నియోజకవర్గంలో పర్యటించానని, ఇక్కడి పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ మహారాష్ట్రకు వచ్చి తెలంగాణ మోడల్‌గా అభివృద్ధి చేస్తానని చెబుతున్నారని, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇక్కడి పరిస్థితి రావద్దని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నానని ఎద్దేవా చేశారు. మహారాష్ట్రతో పోలిస్తే పదేళ్లలోనే తెలంగాణ రూ.లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్, జల్‌జీవన్ మిషన్, ఫసల్‌బీమా పథకాలను ఇక్కడి ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఎంతోమంది పేదలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఏళ్లు గడుస్తున్నా భైంసా మండలం గుండెగాం ముంపు సమస్య పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రంతోపాటు మహారాష్ట్రలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలో ఉండడంతో ఎంతో అభివృద్ధి జరుగుతోందని, తెలంగాణ లోనూ బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావ్ పటేల్, భోస్లే మోహన్‌రావ్ పటేల్, రవి పాండే, నారాయణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్ తదితరులున్నారు.

'రాష్ట్రంలో బీజేపీకే ప్రజాదరణ'



కార్యక్రమంలో మాట్లాడుతున్న తుషార్ రాథోడ్

ఖానాపూర్: రాష్ట్రంలో బీజేపీకే ప్రజాదరణ ఉందని మహారాష్ట్రలోని ముక్కెడ్ ఎమ్మెల్యే తుషార్ రాథోడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు జానుబాయి పేర్కొన్నారు. మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన అసెంబ్లీ స్థాయి ప్రవాస్‌యోజన కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ నియంత పాలన, పోలీస్ రాజ్యం పోవాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 104 మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని పార్టీ శ్రేణులు తిలకించారు. అంతకుముందు పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు భుక్యా జానుబాయి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పడాల రాజశేఖర్, నందిరెడ్డి, బుచ్చన్నయాదవ్, చిలుకూరి తిరుమలగిరి, టీకు ప్రకాశ్, సదాశివ్, శ్రావణ్, కిష్టయ్య, చందు, గోవింద్, స్వామి, రవి, సాయి, గోపాల్‌రెడ్డి, రాజేశ్వర్, రమేశ్ తదితరులున్నారు.

పెంబికి ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



ట్రైనీ ఐఏఎస్‌లకు స్వాగతం పలుకుతున్న సర్పంచ్

పెంబి: మండల కేంద్రానికి ఆదివారం రాత్రి 9గంటలకు ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు వచ్చారు. సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు వీరికి ఘనస్వాగతం పలికారు. ముందుగా వీరికి నాగాపూర్ గ్రామంలోనే గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికి కాసేపు ముచ్చటించారు. ముస్సోరీ లాల్ బహదూర్ శాస్త్రీ నేషనల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న వీరు వారంపాటు మండలంలో పర్యటించనున్నారు.

'ప్రతి ఒక్కరూ ధర్మరక్షణకు పూనుకోవాలి'



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

కుభీర్: ప్రతి ఒక్కరూ ధర్మరక్షణకు పూనుకోవాలని విజయవాడ హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ సూచించారు. కుభీర్ మండలాన్ని ఆనుకుని ఉన్న మహారాష్ట్రలోని పాలజ్ కర్ర గణేశ్ మందిరం నుంచి తిరుపతి వరకు చేపట్టిన కోటి హనుమాన్ చాలీసా కార్యక్రమ రథయాత్రను ఆదివారం స్వామీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సిర్పెల్లి, పార్డి (కే) గ్రామాల్లో భక్తులనుద్దేశించి మాట్లాడారు. ధర్మాన్ని మనం రక్షిస్తే.. ధర్మం మనల్ని రక్షిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ హనుమాన్ చాలీసా చదవాలని, భగవంతుడు మనిషి సంకటాలను దూరం చేస్తాడని పేర్కొన్నారు. చెడు అలవాట్లు వదిలి నియమ, నిష్టలతో భగవంతుడి మార్గంలో పయనించినప్పుడు సమాజం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు పాలజ్‌లో హోమం, గ్రామంలో రథంతో శోభాయాత్ర నిర్వహించారు. రతయాత్ర ద్వారా సిర్పెల్లి, పల్సి గ్రామాల మీదుగా పార్డి (కే)కు చేరుకుని హనుమాన్ మందిరంలో అభిషేకం చేశారు. భక్తులతోపాటు హనుమాన్ చాలీసా పఠించారు. గ్రామస్తులు ఆయనకు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. సోమవారం పార్డి(కే) నుంచి రథయాత్ర ప్రారంభమై భైంసా, నిర్మల్ మీదుగా జనవరి ఒకటిన తిరుపతి చేరుకుంటుందని తెలిపారు. తిరుపతిలో కోటి మందితో హనుమాన్ చాలీసా పఠనం చేస్తారు. దుర్గాప్రసాద్ స్వామీజీ వెంట గురుస్వామి పీరాజీ, హనుమాన్ స్వాములు శ్రీనివాస్, సాయినాథ్, విష్ణు, శంకర్ తదితరులున్నారు.

టూరిజం శాఖకు కడెం ఐబీ



కడెం మండల కేంద్రంలోని ఐబీ

కడెం: కడెం ఐబీని సోమవారం నీటి పారుదలశాఖ అధికారులు పర్యాటక శాఖకు అప్పగించనున్నారు. గతంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కడెం ఐబీ భవనం, ఆరెకరాల స్థలం పర్యాటక శాఖకు అప్పగిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. కడెం ప్రాజెక్ట్ డివిజన్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కొంతకాలంగా ఇరిగేషన్ అధికారులు ఐబీలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఐబీని టూరిజం శాఖకు అప్పగిస్తే కార్యాలయాన్ని ఎక్కడికి తరలిస్తారనే సందిగ్ధం నెలకొంది. డివిజన్ కార్యాలయాన్ని నిర్మల్ లేదా ఇతర ప్రాంతాలకు తరలిస్తారని ప్రచారం జరుగుతోంది. డివిజన్ కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేస్తారో.. స్పష్టం చేశాకే ఐబీని టూరిజం శాఖకు అప్పగించాలని.. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతు నాయకుడు హపావత్ రాజేందర్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ముక్కెర గంగాధర్ డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఉద్యోగి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిందని మావల పోలీస్ స్టేషన్ ఎస్సై రహిమతుల్లా తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..టీచర్స్ కాలనీకి చెందిన ఉద్యోగి ఈ నెల 12న నిడ్స్ హోమ్ ఆఫర్ కింద ఓ వ్యక్తి వాట్సప్ ద్వారా మేసేజ్ చేశారు. దీంతో ఆమె ముందుగా రూ.3వేలు చెల్లించింది. మరోసారి మరికొంత పేమెంట్ చేయాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో రూ.30వేలు చెల్లించింది. మొత్తం రూ.33వేలు చెల్లించగా ఎలాంటి వస్తువులు రాలేదు. మోసపోయినట్లు గ్రహించిన ఆమె ఆదివారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన యువతి శనివారం రాత్రి అదృశ్యమైనట్లు ఎస్సై రహిమతుల్లా తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. కేఆర్కే కాలనీకి చెందిన 16 ఏళ్ల యువతి కుటుంబ సభ్యులు ఆదివారం వేకువ జామున చూడగా కనిపించలేదు. అలాగే ఇంట్లోని రెండు సెల్ ఫోన్‌లతో పాటు రూ.5వేలు నగదు, యువతి బట్టలు కనించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎదులాపురం: మహారాష్ట్ర కిన్వట్ తాలుకా శనివార్‌పేట్‌కు చెందిన రాథోడ్ విజయ్(37) రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. టుటౌన్ హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం... రాథోడ్ విజయ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పని లేక తరచూ మద్యం సేవిస్తూ ఇంట్లో వాళ్లతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈనెల 25న కుటుంబీకులతో గొడవ పడి పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు అతడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆవుపైకి దూసుకెళ్లిన కారు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐబీ ప్రాంతంలో గుర్తు తెలియని కారు ఆవు పైనుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆవు కారు టైర్లలో ఇరుకుపోయింది. అయినా కారును ఆపకకుండా ఈడ్చుకెళ్లడంతో కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని సొంత ఖర్చులతో ఆవుకు వైద్యం చేయించారు.

పాముకాటుతో ఎద్దు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని మాన్కపూర్ గ్రామంలో ఎద్దు పాముకాటుకు గురై మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మాన్కపూర్ గ్రామానికి చెందిన కుంటల్‌వాడ్ అడేల్లు ఆదివారం తన ఎద్దులను తీసుకుని పంట పొలంలోకి వెళ్లాడు. పశుగ్రాసం మేస్తున్న సమయంలో ఎద్దును పాము కాటువేసింది.

బడి.. భవితకు బాసటగా

- విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు
- స్వచ్ఛంద సంస్థల సహకారం.. సొంతంగా పనులు
- సాంకేతికత సాయంతో ప్రైవేటుకు దీటుగా..
- మూతబడే స్థితి నుంచి.. నో అడ్మిషన్ స్థాయికి..
- పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దిన రెబ్బన్‌పల్లి, నిపాని హెచ్‌ఎంలు
- వారి శ్రమకు జాతీయస్థాయి గుర్తింపు
- ఉత్తమ ఉపాధ్యాయులుగా అర్చన, సంతోష్‌కుమార్

విద్యార్థుల భవితను తల్లిదండ్రుల తర్వాత తీర్చిదిద్దేది గురువులే. ఉత్తమ ఉపాధ్యాయుడి చేతిలో పడిన విద్యార్థి భవిష్యత్ ఉజ్వలమే. ప్రాథమిక స్థాయిలోనే చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందిస్తూ.. వారిలో సృజనాత్మకత వెలికితీస్తూ రాణించేలా చొరవ చూపుతారు. వ్యక్తిగత శ్రద్ధ, పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం.. ఎంతో మంది గురువులను ఉత్తమంగా నిలబెడుతుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నుగూరి అర్చన, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బెదోడ్కర్ సంతోష్‌కుమార్ కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు. సాంకేతికత అందిపుచ్చుకుని స్వచ్ఛంద సంస్థల సహకారం.. వ్యక్తిగత శ్రద్ధతో తాము పనిచేస్తున్న పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రైవేటుకు దీటుగా ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని విద్యాబోధన చేస్తున్నారు. ఒక దశలో మూతపడే స్థాయికి చేరిన పాఠశాలలను.. నో అడ్మిషన్ స్థాయికి చేర్చారు. వీరి శ్రమకు ఇప్పటికే అనేక పురస్కారాలు దాసోహమయ్యాయి. తాజాగా జాతీయ ఉత్తమ పురస్కారం సైతం వీరిని వరించింది. తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా ఇద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులే కావడం గమనార్హం. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు వీరు.

– దండేపల్లి/తాంసి


విద్యార్థులకు బోధనలో భాగంగా ఫీల్డ్ ట్రిప్‌నకు తీసుకెళ్లిన అర్చన

34 నుంచి 200 వరకు చేరిన విద్యార్థుల సంఖ్య

2000 సంవత్సరం నవంబర్‌లో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించిన అర్చన 2013లో దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చింది. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థులు 34 మంది మాత్రమే ఉన్నారు. గ్రామానికి చెందిన సంగనభట్ల రాజేంద్రప్రసాద్, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు కూర్చునేందుకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, డిజిటల్ తరగతులు, తాగునీటి కోసం శుద్ధజల ప్లాంటు, కంప్యూటర్ తరగతులు, తదితర వసతులు కల్పించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల తల్లిదండ్రుల దృష్టి ఈ పాఠశాలపై పడడంతో విద్యార్థులను చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో 2018 నుంచి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200కు చేరుకుంది. ప్రస్తుతం పాఠశాలలో అడ్మిషన్ పొందేందుకు తీవ్ర పోటీ ఉంటోంది.

పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలు

పాఠశాల అభివృద్ధికి ప్రతినెల సొంతగా రూ.30 వేలు ఖర్చు చేస్తోంది. సమీప గ్రామాల నుంచి వచ్చే గిరిజన విద్యార్థులకు ఆటోచార్జీలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రైవేటుగా ఉపాధ్యాయులను నియమించి వేతనాలు తానే చెల్లిస్తున్నారు. విద్యార్థులకు ఫీల్డ్‌ట్రిప్ నిర్వహించడం, వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటేలో శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు. ఆమె చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2018లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా 2019లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా 2023లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

సంతోషంగా ఉంది



దాతల సహకారం, తోటి ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు అందుకున్నా. వాటన్నింటికంటే భిన్నంగా ఈసారి జాతీయ స్థాయికి ఎంపిక కావడం, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకునే అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది.

– నుగూరి అర్చన, హెచ్‌ఎం, రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల, దండేపల్లి, మంచిర్యాల


డిజిటల్ తెరపై పాఠాలను బోధిస్తున్న సంతోష్ కుమార్

అధునాతన బోధనతో..

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న బెదోడ్కర్ సంతోష్‌కుమార్ పాఠశాలలో నూతన సాంకేతికత పద్ధతులతో విద్యాబోధన చేస్తున్నారు. డిజిటల్ తరగతులు, ప్రత్యేక యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ప్రత్యేకంగా గూగుల్ క్లాస్ రూమ్ యాప్ సాయంతో యూట్యూబ్ ఛానల్ పెట్టారు. దీనిద్వారా విద్యార్థులకు నిత్యం ఆన్‌లైన్ ద్వారా తరగతులు బోధించాడు. నిత్యం తరగతి గదిలో బోధించే పాఠ్యాంశాలను రోజు వారీగా యూట్యూబ్‌లో వీడియోలను చేర్చేవారు. పాఠశాలలో బోధించిన పాఠాలను విద్యార్థులు ఇంటివద్ద వినే అవకాశం కల్పించారు. బోధనతో పాటు ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ సైతం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు.

డిజిటల్ తరగతులు

పాఠశాలల్లోని డిజిటల్ తరగతి గదుల్లో ఉన్న పెద్ద స్క్రీన్‌పై ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే పద్ధతిలో డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పాటు గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో అదనపు గదులు, మూత్రశాలల నిర్మాణం చేపట్టారు. డ్రాపౌట్స్ లేకుండా గ్రామస్తులకు చదువుపై అవగాహన కల్పించారు. ప్రతిభ పరీక్షల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ...వినూత్న ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుదలకు విశేష కృషి చేస్తున్నారు. డిజిటల్ పాఠాల తయారీ, రిసోర్స్ పర్సన్‌గా తోటి ఉపాధ్యాయులకు సైతం శిక్షణ ఇచ్చారు. 2011లో బెదోడ్కర్ సంతోష్‌కుమార్ పాఠశాలకు బదిలీపై వచ్చిన సమయంలో విద్యార్థుల సంఖ్య 135 ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 220కు చేరుకుంది.

అందరి కృషి ఫలితమే



జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు రావడంతో నాపై మరింత బాధ్యత పెంచింది. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతోనే అవార్డు వరించింది.ఆదిలాబాద్ జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్న.

– బెదోడ్కర్ సంతోష్ కుమార్, నిపాని ప్రాథమికోన్నత పాఠశాల

సమ్మె బాటలో.. సమగ్రశిక్ష ఉద్యోగులు

- మూడు రోజులుగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా
- అధికారులు, పోలీసులను కలిసి వినతిపత్రాలు అందజేత


ఆసిఫాబాద్ డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల వివరాలు

ఆదిలాబాద్: 607	మంచిర్యాల: 513
కుమురం భీం: 473	నిర్మల్: 424

ఇవి డిమాండ్లు..
- సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
- అప్పటివరకు ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) అమలు చేయాలి
- ఉద్యోగులందరికీ 10 లక్షల జీవిత, ఆరోగ్య బీమా చెల్లించాలి
- ఎస్‌ఎస్‌ఏ మృతిచెందితే కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

కెరమెరి(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడం లేదని సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. నేటి నుంచి మూడు రోజులపాటు కలెక్టరేట్ల ఎదుట ధర్నా, రిలేదీక్షలు నిర్వహించనున్నారు. మొదటి రోజు ధర్నాతోపాటు, 29, 30న 48 గంటల రిలే దీక్షలు చేపట్టనున్నారు. జిల్లాల బాధ్యులు, పోలీస్, జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.

ఎస్పీడీ కార్యాలయం ముట్టడితో..

ఈనెల 16న రాష్ట్ర విద్యాశాఖ ఎస్పీడీ కార్యాలయం ముట్టడి విజయవంతంతో ఉద్యోగులంతా ఏకమయ్యారు. సమగ్ర శిక్షలో క్లస్టర్ స్థాయి రిసోర్స్ పర్సన్లు, ఎమ్మార్సీలో ఎంఐఎస్ కోర్డినేటర్లు, సీసీవోలు, జిల్లా కేంద్రాల్లో డీపీవో సిబ్బంది, కేజీబీవీల్లో, యూఆర్‌ఎస్‌లో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, పీటీఐ, మెసెంజర్లు, అటెండర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ తదితరులు రాష్ట్రవ్యాప్తంగా 22 వేల మంది ఉన్నారు.

ఉద్యమాలు చేపడుతాం



ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులపై ప్రభుత్వానికి కనికరం లేదు. అన్ని అర్హతలున్నా రెగ్యులరైజ్ చేయాలి. అప్పటివరకు ఎంటీఎస్ ఇవ్వాలి. తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగుతున్నాం. పట్టించుకోకపోతే రాష్ట్రస్థాయిలో ఉద్యమాలు చేపడుతాం. సమ్మెకు సైతం వెనుకాడం.

– పదాల రవీందర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి

వాహనం ఒకరిది.. చలాన్లు మరొకరికి


ఉట్నూర్‌లో డూప్లికేట్ నంబర్‌తో బైక్


తప్పుడు నంబర్‌తో నిర్మల్ జిల్లాలో..


వాహనదారుడికి పడిన చలాన్లు

ఆదిలాబాద్‌టౌన్: కొంతమంది వాహనదారులు పోలీసుల చలాన్ల నుంచి తప్పించుకునేందుకు జిమ్మిక్కులు చేస్తున్నారు. తమ వాహనానికి ఇతరుల వాహనాలకు సంబంధించిన నచ్చిన నంబర్లు పెట్టుకుంటున్నారు. రోడ్లపై తిరిగే సమయంలో పోలీసులు ఈ వాహనాలకు చలాన్లు వేసినప్పుడు ఇతరులకు మెస్సేజ్‌లు వెళ్తున్నాయి. దీంతో ఆ వాహనదారులు హైరానా చెందుతున్నాడు. తమ వాహనం ఇంటి వద్దే ఉన్నప్పటికీ చలాన్లు రావడం ఏమిటని ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటిదే మావల మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు మైస మాధవ్‌కు చలాన్ల మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఒకట్రెండు కాకుండా.. ఏకంగా రూ.1805ల చలాన్లు రావడంతో ఆయన అవాక్కయ్యాడు. తన బైక్ నంబర్ (ఏపీ01ఆర్) ఉండగా అదే నంబర్‌తో ఓ ఎక్సల్ వాహనం నిర్మల్ జిల్లాలో తిరుగుతుండగా, అలాగే ఉట్నూర్‌లో మరో బైక్ వాహనదారుడు తన బైక్ నంబర్లను పెట్టుకొని ఉన్నట్లు తెలిసింది. తనకు చలాన్ రూపంలో వచ్చిన ఫొటోలు, లొకేషన్ ఆధారంగా వీటిని కనుగొన్నట్లు తెలిపాడు. గతంలో నిర్మల్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఇటీవల మళ్లీ చలాన్లు పడుతున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.

పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య

నేరడిగొండ: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బామని కిషన్ (38) తనకున్న రెండెకరాలతో పాటు మూడెకరాలు కౌలుకు తీసుకొని ఐదెకరాలు సాగు చేస్తున్నాడు. పత్తి, సోయా, మక్క పంటలు వేశాడు. రూ.5లక్షల అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఆటో బోల్తా ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్యులు


క్షతగాత్రులను 108లో తరలిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడిన సంఘటనలో ఏడుగురికి గాయాలు కాగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని హీరాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. ప్రత్యేక సాక్షుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్ మండలంలోని వాగపూర్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు ఆటోలో ఉట్నూర్ మండలంలోని పేర్కగూడ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ ప్రధాన రహదారిపై ఎదురుగా కుక్కలు రావడంతో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మర్సుకోల హనుమంత్‌రావ్, మర్సుకోల లక్ష్మీబాయితో పాటు మర్సుకోల సేవంతబాయిలకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్, మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. హనుమంత్‌రావ్ పరిస్థితి విషమంగా ఉందని 108 పైలెట్ ఆత్రం అశోక్ తెలిపారు.

ప్రాణాలు తీసిన అతివేగం

నిర్మల్ జిల్లా సమీపంలోని జాతీయ రహదారులపై ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో అతివేగంగా దూసుకొచ్చిన లారీ మూలమలుపు వద్ద నిలిపిఉన్న టిప్పర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో ఘటనలో డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి ఎదురుగా వచ్చిన లారీని ఢీకొంది. అంతటితో ఆగకుండా మరో లారీని ఢీకొనగా అదే లారీకింద వ్యాన్ డ్రైవర్ ఎగిరిపడి మృతిచెందాడు. ఈ సంఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

- రక్తమోడిన జాతీయ రహదారులు
- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత
- టిప్పర్‌ను లారీ ఢీకొట్టినఘటనలో ముగ్గురు
- మరో ఘటనలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ మృతి


లాల్‌సింగ్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న యువకులు

మృత్యుఒడికి ముగ్గురు..

మామడ: లారీ రూపంలో వచ్చిన మృత్యువు ముగ్గురి ప్రాణాలు కబలించింది. దీంతో ఆ గిరిజన నిరుపేద కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలలోకి వెళ్తే... మండలంలోని పులిమడుగు గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేరడిగొండ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కుమ్రం రాజేంద్రప్రసాద్(31), బందంరేగడి గ్రామానికి చెందిన లాల్‌సింగ్(45), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాలోని బుద్ద రామసముద్రంనకు చెందిన లారీ క్లీనర్ షేక్ ఖాసీం పీర(43) మృతిచెందారు.

ఎలా జరిగింది...

కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పులిమడుగు సమీపంలోని జాతీయ రహదారిపై టిప్పర్ ద్వారా మట్టితో రోడ్డు పక్కన గుంతలకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో టిప్పర్ బోల్తా పడింది. టిప్పర్‌ను నడుపుతున్న లాల్‌సింగ్‌తో పాటు టిప్పర్‌లోని కుమ్రం రాజేంద్రప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కుమ్రం రాజేంద్రప్రసాద్ తండ్రి కుమ్రం జంగు నేరడిగొండ మండలంలోని లకంపూర్(జి) గ్రామ సర్పంచ్. రాజేంద్రప్రసాద్ జాతీయ రహదారి నిర్వహణ కంపెనీలో కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బందంరేగడి గ్రామానికి చెందిన లాల్‌సింగ్ కొన్ని రోజులుగా ఈ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

మూలమలుపు.. అతివేగం

ప్రమాదం జరిగిన స్థలం వద్ద మూలమలుపు ఉంది. ఆదిలాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఈ గుట్ట ప్రాంతంలో 40కిలో మీటర్ల వేగంతో వెళ్లాల్సి ఉన్నప్పటికీ మూలమలుపుతో పాటు రోడ్డు పల్లంగా ఉండటంతో వేగం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రమాదంలో


ప్రమాద స్థలంలో లారీ

గాయపడిన లారీ క్లీనర్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీలను ఢీకొట్టిన డీసీఎం

నిర్మల్ రూరల్: అతివేగం.. ఆపై నిర్లక్ష్యం... అజాగ్రత్తగా డ్రైవింగ్ చేసి నిండుప్రాణం తీసుకున్నాడు డీసీఎం డైవర్. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికుల కథనం ప్రకారం.... మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌కు చెందిన డీసీఎం వాహనం నిర్మల్ రూరల్ మండలం చిట్యాల బ్రిడ్జి పైన సిమెంట్ లోడుతో భైంసా వైపు వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొట్టింది. అనంతరం కంట్రోల్ తప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ సమయంలో వ్యాన్ డ్రైవర్ మోహిత్‌పాల్ (44) రెండో లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మొదటి లారీ డ్రైవర్ షేక్ అజీజ్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు శ్రమించి బయటకు తీసుకొచ్చి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి డీసీఎం డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే కారణమని పోలీసులు పేర్కొన్నారు. మోహిత్‌పాల్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కందువ జిల్లా అట్టర్ గ్రామస్తుడిగా గుర్తించారు. బ్రిడ్జిపై మూడు వాహనాలు నిలిచిపోవడంతో రెండువైపులా ట్రాఫిక్ స్తంభించింది. భైంసా, మహారాష్ట్ర వైపు వెళ్లే వాహనాలను జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ మీదుగా తరలించారు. రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అతికష్టం మీద ఢీకొన్న వాహనాలను పక్కకు తొలగించి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు


మోహిత్‌పాల్ మృతదేహం